# వేగుచుక్క

VC NEWS

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ నవంబర్ 26 మంగళవారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 120




5లో

మహా పీఠంపై ఎవరు? తెరపైకి కొత్త ముఖాలు !

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయ్

- మహారాష్ట్రలో తగిన బుద్ధి చెప్పారు
- రాళ్లలో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారు
- బీఆర్ఎస్ మీదే కేసులా... కాంగ్రెస్ మీద కేసులుండవా.?
- మహబూబాబాద్ మహాధర్నాలో మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం



2లో

## అదానీతో అంటకాగింది భారాస నేతలే



అదానీ సంస్థలకు ఎన్నో ప్రాజెక్టులను భారాస హయాంలో ఇచ్చారు. ఇందుకు కేసీఆర్‌ను ప్రాసిక్యూట్ చేయాలా? గతంలో జాతీయ రహదారుల నిర్మాణం, డేటా సెంటర్లు, ఇతర సంస్థలు ప్రారంభించడానికి మీరు కేటాయించిన భూముల విషయంలో మీ మీద ఏమైనా కేసులు పెట్టాలా? అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాల్సి వస్తే..

- కేసీఆర్ హయాంలోనూ అదానీ సంస్థలకు పనులు
- కేటీఆర్ ఏం మాట్లాడుతున్నారో.. వాళ్ల నాయకులకే అర్థం కావడంలేదు
- ఎవరికీ అయాచిత లబ్ధి చేకూర్చే విధానం మా ప్రభుత్వంలో ఉండదు
- విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్నిసార్లయినా దిల్లీకి వెళ్తామంటూ స్పష్టీకరణ
- రూ.100 కోట్ల విరాళం తిరస్కరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ

హైదరాబాద్: భారాస ప్రభుత్వ హయాంలో అదానీ సంస్థలతో చేసుకున్న ఒప్పందాలు చాలానే ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. కేసీఆర్ సర్కారే అదానీ సంస్థలకు పలు జాతీయ రహదారులు, డేటా సెంటర్ల కాంట్రాక్టులిచ్చిందని.. భూములు కేటాయించిందని పేర్కొన్నారు. అదానీ విమానంలో ఆడంబరంగా ప్రయాణాలు చేసిందీ వాళ్లేనన్నారు. అదానీతో అంటకాగి, ఆయన దగ్గర కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. 'జరుగుతున్న వివాదాలు, ఆరోపణల నేపథ్యంలో.. 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి మీరు ఉదారంగా ఇస్తామన్న రూ.100 కోట్లను తెలంగాణ ప్రభుత్వం స్వీకరించడానికి సిద్ధంగా లేదు. కాబట్టి రూ.100 కోట్లను స్కిల్స్ యూనివర్సిటీ ఖాతాలోకి బదిలీ చేయొద్దు' అని తెలంగాణ ప్రభుత్వం.. అదానీ సంస్థలకు విస్పష్టంగా లేఖ రాసినట్లు సీఎం రేవంత్ పేర్కొన్నారు. పక్క రాష్ట్రాలు, దేశాల్లో అదానీ గ్రూప్ కంపెనీల విషయంలో జరుగుతున్న వివాదానికి.. తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

పెట్టుబడులపై భారాస విధానమేంటి?

"ఒక ఒప్పందాన్ని రద్దు చేయాలంటే.. దానికి న్యాయపరమైన సలహాలూ తీసుకోవాల్సి ఉంటుంది. పెట్టుబడుల విషయంలో



అదానీ సంస్థలకు ఎన్నో ప్రాజెక్టులను భారాస హయాంలో ఇచ్చారు. ఇందుకు కేసీఆర్‌ను ప్రాసిక్యూట్ చేయాలా? గతంలో జాతీయ రహదారుల నిర్మాణం, డేటా సెంటర్లు, ఇతర సంస్థలు ప్రారంభించడానికి మీరు కేటాయించిన భూముల విషయంలో మీ మీద ఏమైనా కేసులు పెట్టాలా? అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాల్సి వస్తే.. మీ మీద కూడా కేసులు పెట్టాల్సి వస్తుంది. వాటన్నింటిపైనా విచారణకు సిద్ధమేనా?

భారాస నేతలను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి

ఎవరికీ అయాచిత లబ్ధి చేకూర్చే విధానం మా ప్రభుత్వంలో ఉండదు. ఒకపక్కన రాష్ట్రానికి పెట్టుబడులు రావడం లేదని మాట్లాడుతారు.. ఇంకోపక్కన వస్తే.. వాటిని రద్దు చేయాలని అంటున్నారు.

## ప్రజా సమస్యలే ఎజెండాగా చర్చించాలి



2లో

- కొత్త ఏడాదిలోకి అడుగిడుగుతున్న తరుణం
- మనమంతా కలసికట్టుగా ముందుకు సాగాలి
- రాజ్యాంగం ఆవిర్భవించి నేటికి 75 ఏళ్లు
- సంవిధాన్ సదన్‌లో నేడు రాజ్యాంగ దినోత్సవం
- పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ప్రధాని మోడీ

ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోరు. వారికి ప్రజలపై ఎలాంటి బాధ్యత ఉండదు. అందుకే వారు ప్రజల అంచనాలను ఎన్నటికీ అందుకోలేరని మోదీ సభా కార్యకలాపాలు సాగనివ్వని వారి తీరును ఆక్షేపించారు



3లో

## ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన 5,431 మందికి లీగల్ నోటీసులు

వాహన యజమానుల పెండింగ్ చలాన్ల డేటా సేకరణ



2లో

## సీఎం పీఠంపై వీడని ఉత్కంఠ

సీఎం పీఠంపై తలెత్తిన ప్రతిష్ఠంభనను తొలగించేందుకు ఢిల్లీలో సోమవారం 'మహాయుతి' అగ్రనేతలతో సమావేశం ఏర్పాటైంది.



2లో

## హౌసింగ్ సొసైటీలకు సుప్రీంకోర్టు షాక్

## రేపటికి వాయిదా పడ్డ శీతాకాల సమావేశాలు



2లో



## కేసీఆర్ పాలనలోనే బీసీలకు న్యాయం

### కులగణనకు చట్టబద్ధత ఉందా..? : ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్:** కులగణనకు చట్టబద్ధత ఉందోలేదో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. బీసీ సంఘాలు, యునైటెడ్ ఫులే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులతో కలిసి డెడికేటెడ్ కులగణన కమిషన్‌కు 35 పేజీలతో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో చేపట్టిన సమగ్ర నివేదికను కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని గత ప్రభుత్వం బీసీలకు ఎంతో న్యాయం చేసిందన్నారు. కులగణకు బీజేపీ వ్యతిరేకమని విమర్శించారు. కులగణన చేపట్టబోమని బీజేపీ సుప్రీంకోర్టుకు అఫిడవిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. బీజేపీ ద్వంద వైఖరిని బీసీలు ఖండించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఎన్నో హామీలు ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వేగుచుక్క

# సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయ్



**హైదరాబాద్:** అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మహారాష్ట్రకు పోయి కూడా ఆడబిడ్డలను మోసం చేసే ప్రయత్నం చేస్తే అక్కడి ఆడబిడ్డలు బుద్ధి చెప్పారని తెలిపారు. వీడు పచ్చి లంగా, తెలంగాణలో ఆడబిడ్డలను మోసం చేశాడని చైతన్యం ప్రదర్శించి తన్ని తన్ని తరిమేశారని పేర్కొన్నారు. నేను ఇక్కడ వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతమని అంటున్నారని కేటీఆర్ తెలిపారు. నేను డీజీపీ, ఎస్పీ గారిని అడుగుతున్నా.. రాళ్లతో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేసులు మా మీద మాత్రమే పెడుతారా? కాంగ్రెస్ ఎమ్మెల్యేల మీద కేసులు ఉండవా? అని నిలదీశారు. మా గిరిజన రైతుల కోసం కదులుతూ మానుకోటలో ధర్నా చేస్తామంటే లగచర్లలో జరిగిన సంఘటనకు మానుకోటలో ధర్నా ఎందుకు అని డీజీపీ ప్రశ్నించారని తెలిపారు. కొడంగల్ రైతుల కోసం ఒక్క మానుకోటలోనే కాదు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ దళితులు, బీసీలు, గిరిజనులు ఉన్నారో అక్కడ ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. సన్నకారు, బక్క చిక్కిన రైతులతో పెట్టుకున్న ఈ రేవంత్ రెడ్డికి తప్పకుండా బుద్ధి చెప్పే సమయం వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. .రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే దాకా వదిలిపెట్టమని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతామంటే, పెట్రోల్ పోస్తామంటే భయపడమని కేటీఆర్ అన్నారు. మేము కేసీఆర్ తయారు చేసిన దళం.. భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మానుకోట రాళ్ల మహత్యం ఏందో తెలంగాణను అడ్డుకున్న వాళ్లందరికీ తెలుసని అన్నారు. మానుకోటలో 14 ఏళ్ల క్రితమే నిప్పు పుట్టి ఆ తర్వాత తెలంగాణ వచ్చిందని అన్నారు. ఇవాళ మీరు పర్మిషన్ ఇవ్వకుంటే హైకోర్టుకు వెళ్లి పర్మిషన్ తెచ్చుకున్నామని అన్నారు. ఈ మహా ధర్నాకు వెయ్యి మంది అనుకుంటే 25 వేల మంది వచ్చారని.. అంటే ప్రభుత్వం మీద ఎంత కోపం, వ్యతిరేకత ఉందో ఈ మానుకోట మహాధర్నా చూస్తే అర్థమవుతోందని అన్నారు.

తెలంగాణ ఉద్యమంలో మానుకోట కీలకం

ఇదే మానుకోట 14 ఏళ్ల కిందట ఇదే మానుకోట తెలంగాణ ఉద్యమంలో ఓ కీలకమైన మలుపునకు కారణమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ అదే మానుకోట ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ భూములు గుంజుకుంటా ఏం చేసుకుంటారో చేసుకోండి అంటున్న కొత్త నియంతకు బుద్ధి చెప్పేందుకు సిద్ధమైందని తెలిపారు. అసలు ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఏం జరిగిందో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. లగచర్లలో ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ ముఖ్యమంత్రి మీద తిరగబడ్డారని కేటీఆర్ తెలిపారు. వారి భూములను తీసుకుంటామని చెబితే మా ఆడబిడ్డలు

9 నెలల పాటు ధర్నా చేసి నిరసన తెలిపారని అన్నారు. 9 నెలలుగా సొంత నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ ముఖ్యమంత్రికి సమయం లేదని విమర్శించారు. కానీ ఎక్కే విమానం దిగే విమానం అన్నట్లుగా 28 సార్లు ఢిల్లీకి పోయిండు.. కనీసం 28 పైసలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు. సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి మీద ప్రజలు తిరగబడుతున్నారని తెలిపారు. మొన్న అధికారులు పోతే ప్రజలు నిరసన తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి, ఉరికించి కొట్టేవారని అన్నారు. ఎందుకంటే ఢిల్లీలో రైతులు ఏడాది పాటు ఆందోళన చేసి మోదీ లాంటి వ్యక్తినే నల్ల చట్టాల నుంచి వెనక్కి తగ్గేలా చేశారని గుర్తుచేశారు. రైతుల పవర్ అంటే ఆ విధంగా ఉంటుందని.. అలాంటి పవర్ ఉన్న రైతులతో రేవంత్ రెడ్డి పెట్టుకున్నాడని మండిపడ్డారు.

## సీఎం పీఠంపై వీడని ఉత్కంఠ



**ముంబై:** 'మహాయుతి' కూటమి 236 సీట్లతో అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించడంతో ముఖ్యమంత్రి ఎవరనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. సీఎం సీటుకు సంబంధించి ఏదైనా ఫార్ములాపై చర్చ జరుగుతోందా అనే విషయంపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సోమవారం స్పందించారు. అలాంటి ఫార్ములా ఏదీ చర్చకు రాలేదని ఆయన చెప్పారు. మహాయుతి ప్రభుత్వానికి పట్టం కడుతూ ప్రజలు చాలా గట్టి తీర్పునిచ్చారని, అసెంబ్లీ విపక్ష నేత పదవికి అవసరమైన సంఖ్యాబలం కూడా 'మహా వికాస్ అఘాడి'కి రాలేదని చెప్పారు. "ఏ ఫార్ములాపై చర్చ జరగడం లేదు. మేము ముగ్గురూ (కూటమి) కలిసి సీఎం పదవిపై చర్చిస్తాం. అసెంబ్లీలో ఎన్సీపీ నేతగా నన్ను ఎన్నుకున్నారు. శివసేన తరఫున ఏక్‌నాథ్ షిండే ఎన్నికయ్యారు. బీజేపీ కూడా ఇదే చేసింది. మేము కలిసి చర్చించుకుని సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం" అని అజిత్ పవార్ తెలిపారు. సీఎం రేసులో బీజేపీ నేత, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ముందంజలో ఉన్నారు. బీజేపీ పోటీ చేసిన 149 స్థానాల్లో 132 స్థానాలను ఆ పార్టీ గెలుచుకోవడంతో ఫడ్నవిస్‌కు మూడోసారి సీఎం పగ్గాలు అప్పగిస్తారనే వాదన బలంగా ఉంది. మరోవైపు సీఎం రేసులో ఏక్‌నాథ్ షిండే ఉన్నారని ఆ పార్టీ నేత సంజయ్ షిర్‌సత్ తెలిపారు. సీఎం ఎవరనేది అంతిమంగా ఢిల్లీలో నిర్ణయిస్తారని, చర్చలు జరుగుతున్నందున ఫలితం ఏమిటనేది వేచిచూడాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు కూడా జరగాల్సి ఉన్నందున దానిని కూడా సీఎం ఎంపిక విషయంలో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మంగళవారానికి ఒక స్పష్టత వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

ఢిల్లీలో కీలక సమావేశం

సీఎం పీఠంపై తలెత్తిన ప్రతిష్ఠంభనను తొలగించేందుకు ఢిల్లీలో సోమవారం 'మహాయుతి' అగ్రనేతలతో సమావేశం ఏర్పాటైంది. హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సైతం హాజరవుతున్నారు. సమావేశానంతరం కీలక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

# ప్రజా సమస్యలే ఎజెండాగా చర్చించాలి



**న్యూఢిల్లీ:** ప్రజలతో తిరస్కరణకు గురైన వారు పార్లమెంట్‌ను నియంత్రించే పనిలో ఉన్నారని ప్రధాని మోదీ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారి సమస్యలపై చర్చకు అంతా సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వం అందుకు సంసిద్ధంగా ఉందన్నారు. శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ వెలుపల మీడియా పాయింట్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడారు. పార్లమెంట్‌లో ఫలవంతమైన చర్చలు జరగాలని అధికార, విపక్ష సభ్యులను మోదీ కోరారు.ప్రస్తుతం మనం 2024ను పూర్తి చేసుకోబోతున్నాం అని అన్నారు. పార్లమెంట్‌లో ఆరోగ్యకరమైన చర్చలు జరపాలని ఎంపీలందరికీ విజ్ఞప్తి చేశారు. విపక్షాలను టార్గెట్ చేస్తూ.. పార్లమెంట్‌లో చర్చకు అనుమతించడం లేదని ఆరోపించారు. ఇది 2024 సంవత్సరానికి చివరి కాలం' అని ప్రధాని అన్నారు. 2025 కోసం దేశం సిద్ధమవుతోంది. ఈ పార్లమెంట్ సమావేశాలు ఎన్నో అంశాలపరంగా ముఖ్యమైనవి. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి ఈ నవంబరు 26 నాటికి 75వ ఏడాదిలోకి అడుగు పెడుతున్నాం. దానికి గుర్తుగా రేపు సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకుందాం అని మోదీ మీడియాతో మాట్లాడారు. ప్రజల చేత తిరస్కరణకు గురైన కొందరు వ్యక్తులు.. కొందరి చేత గూండాయిజం చేయించి, పార్లమెంట్‌ను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి చర్యలను దేశ ప్రజలంతా చూస్తున్నారు. సమయం వచ్చినప్పుడు వారు చూస్తూ ఊరుకోరు. అయితే ఇక్కడ బాధించే విషయం ఏంటంటే.. పార్టీలతో సంబంధం లేకుండా కొత్తగా పార్లమెంట్‌కు ఎన్నికైన వారు కొత్త ఆలోచనలతో వస్తుంటారు. కొందరి గందరగోళ చర్యల వల్ల కొత్త ఎంపీలకు సభలో మాట్లాడే అవకాశం రావడం లేదు. వారు ప్రజాస్వామ్య స్ఫూర్తిని గౌరవించరు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోరు. వారికి ప్రజలపై ఎలాంటి బాధ్యత ఉండదు. అందుకే వారు ప్రజల అంచనాలను ఎన్నటికీ అందుకోలేరని మోదీ సభా కార్యకలాపాలు సాగనివ్వని వారి తీరును ఆక్షేపించారు. ప్రపంచం ఇప్పుడు మనల్ని ఎంతో ఆశావహ దృక్పథంతో చూస్తోంది. ఆ గౌరవం పెంపొందేలా సభలో మన ప్రవర్తన ఉండాలి. పార్లమెంట్ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉంది. దానికి అనుగుణంగా మనం నడుచుకోవాలి. వివిధ అంశాలను సరైన రీతిలో సభలో ఎత్తిచూపడం ద్వారా మనం వారి ఆకాంక్షలను నెరవేర్చగలం. దానినుంచి రాబోయే తరాలు ప్రేరణ పొందుతాయి. ఈ సెషన్ ఫలవంతంగా ఉంటుందని ఆశిస్తున్నాను. ఈ సమావేశాలను ఉత్సాహంగా ముందుకుతీసుకెళ్లాలని ఎంపీలందరినీ కోరుతున్నానని మోదీ అన్నారు. దేశం 2025ని పూర్తి ఉత్సాహంతో, ఉత్సాహంతో స్వాగతించేందుకు సిద్ధమవుతోంది. ఈ పార్లమెంటు సమావేశాలు అనేక విధాలుగా ప్రత్యేకమైనవి. ఇప్పుడు అతిపెద్ద విషయం ఏమిటంటే, మన రాజ్యాంగం 75 సంవత్సరాల ప్రయాణం, 75వ సంవత్సరంలోకి ప్రవేశించడం ప్రజాస్వామ్యానికి మంచి అవకాశమని గుర్తు చేశారు. రాజ్యాంగం 75వ వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించడానికి రేపు అందరూ రాజ్యాంగ పరిషత్‌లో కలిసి రావాలని ప్రధాని కోరారు.

మహారాష్ట్ర, యూపీలో బంపర్ విజయం సాధించిన తర్వాత ప్రధాని మోదీ తొలిసారి పార్లమెంట్ సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించారు. శీతాకాల సమావేశాలు కావడంతో వాతావరణం చల్లగా ఉంటుందని ప్రధాని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు. విపక్షాలపై విరుచుకుపడిన ప్రధాని మోదీ, కొద్దిమంది వ్యక్తులు సభలో గందరగోళం సృష్టిస్తున్నారని ప్రస్తావించారు. ఆ వ్యక్తులు తమ బాధ్యతలను అస్సలు పట్టించుకోవడం లేదన్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలు తిరస్కరించిన కొందరు వ్యక్తులు తమ గూండాయిజంతో పార్లమెంట్‌ను అదుపు చేసేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమని ప్రధాని మోదీ అన్నారు. వారు పార్లమెంటులో చర్చకు అనుమతించరు. పార్లమెంటు కార్యకలాపాలను ఆపడమే వారి సొంత లక్ష్యమని ఎద్దేవా చేశారు ప్రధాని మోదీ. కానీ దేశ ప్రజలు వారి ప్రవర్తనను పట్టించుకోరని, సమయం వచ్చినప్పుడు ప్రజలు వారిని శిక్షిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పార్లమెంటులో ఆరోగ్యకరమైన చర్చ జరగాలని సూచించారు. సాంప్రదాయం ప్రకారం సమావేశాల మొదటి రోజు, ప్రధాని మోదీ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రసంగించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఉభయ సభలు, లోక్‌సభ, రాజ్యసభల 19-9 సమావేశాలు జరుగుతాయి. వక్ఫ్ (సవరణ) బిల్లుతో సహా 16 బిల్లుల జాబితాను ప్రభుత్వం సెషన్‌లో పరిశీలనకు సిద్ధం చేసింది. లోక్‌సభలో ఎనిమిది, రాజ్యసభలో రెండు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం పలు ముఖ్యమైన బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించేందుకు ప్రయత్నిస్తుంది.

## రేపటికి వాయిదా పడ్డ శీతాకాల సమావేశాలు



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు బుధవారానికి వాయిదా పడ్డాయి. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఉభయ సభలు.. తొలుత ఇటీవలేకాలంలో మృతి చెందిన సభ్యులకు సంతాపం తెలిపాయి. ఆ తర్వాత లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత అదానీ అంశంపై చర్చించాలని విపక్షాలు పట్టుబడ్డాయి. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓంబిర్లా సభను బుధవారానికి వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. దీంతో ఎగువ సభను చైర్మన్ ధన్‌కర్ బుధవారానికి వాయిదా వేశారు. ఉభయ సభలు బుధవారం ఉదయం 11 గంటలకు తిరిగి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 20 వరకు జరిగే ఈ సమావేశాల్లో వక్ఫ్ (సవరణ) సహా 16 బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. మణిపూర్ హింస, గౌతమ్ అదానీ అవినీతి చర్యలపై యూఎస్ అరెస్ట్ వారెంట్, ఢిల్లీలో వాయు కాలుష్యం తదితర అంశాలపై ఈ సమావేశాల్లో మోదీ సర్కారును నిలదీసేందుకు విపక్షాలు సిద్ధమయ్యాయి.

## రాజ్యాంగ ప్రవేశికపై సుప్రీం కీలక తీర్పు

### ప్రవేశికలో లౌకిక, సామ్యవాద పదాలు తొలింపు పిటిషన్ కొట్టివేత



**న్యూఢిల్లీ:** రాజ్యాంగ ప్రవేశిక అంశంపై సోమవారం సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ప్రవేశికలో లౌకిక, సామ్యవాద పదాలు తొలగించాలని దాఖలైన పిటిషన్లను తాజాగా కొట్టివేసింది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. రాజ్యాంగ పీఠికలో సామ్యవాద, లౌకిక అనే పదాలను జోడిస్తూ 1976లో చేసిన 42వ సవరణను సవాలు చేస్తూ సుప్రీంకోర్టు లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ పదాలను తొలగించాలని కోరుతూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి తదితరులు ఈ పిటిషన్లు వేశారు. ఆ సవరణపై పార్లమెంట్‌లో చర్చే జరగలేదని వారు వాదించారు. ఎమర్జెన్సీ (1975-77) సమయంలో చేసిన ఈ సవరణల చట్టబద్ధతను వారు ప్రశ్నించారు. ఈ పిటిషన్లపై పలు వాదనలు విన్న సుప్రీంకోర్టు నవంబర్ 22న తీర్పు రిజర్వ్ చేసి, తాజాగా ఆ పిటిషన్లను కొట్టివేసింది. ఈ పదాలకు వివిధ వివరణలున్నాయని.. వేర్వేరుగా అన్వయించుకుంటున్నారని గత విచారణల్లో సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. 'సోషలిజం అంటే.. అందరికీ సమాన అవకాశాలు ఉండాలని. సమానత్వం అనే అంశాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. మీరు దీనిని మరో రకంగా చూడకూడదు. అప్పుడు వేరే అర్థం కూడా వస్తుంది. ఇక సెక్యులర్ అనే పదం కూడా అంతే' అని పేర్కొంది.

# ఏడాదిన్నర పాపతో కలిసి చెరువులో దూకిన తండ్రి.

### భార్యను ఉద్దేశించి సుసైడ్ లెటర్

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 25:**

జీవితంలో ఏదీ సాధించలేకపోతున్నా, నాకు చావే శరణ్యం.. నన్ను క్షమించు' అంటూ భార్యను ఉద్దేశించి సుసైడ్ నోట్ రాసి భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. తన మరణం తరువాత రెండో పెళ్లి చేసుకోవాలని భార్యను కోరుతూ సుసైడ్ నోట్ రాసిన అతడు.. బ్రెయిన్ సరిగా ఎదగని తన కూతురు భార్యకు అడ్డు కాకూడదని ఆమెను వెంట తీసుకువెళ్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.



హృదయ విదారక ఘటన సోమవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. నగరంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన రఘుపతి క్రాంతికుమార్ (35)కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఏడాదిన్నర వయస్సున్న పెద్ద కూతురికి చిన్ననాటి నుంచి మెదడు ఎదుగుదల లేకపోవడంతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

అయినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఈ క్రమంలోనే తాను జీవితంలో ఏదీ సాధించకపోతున్నానని జీవితంపై విరక్తి చెందిన క్రాంతి కుమార్ సోమవారం

తెల్లవారుజామున 4గంటల సమయంలో పాపతో కలిసి న్యాల్ కల్ చెరువు వద్దకు వెళ్లి అందులో దూకాడు. ధర్మారం గురుకులంలో డాటా ఎంట్రీ ఆపరేటర్ గా క్రాంతికుమార్ పనిచేస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఫుడ్ పాయిజన్‌కి గురైన విద్యార్థిని శైలజ మృతి

హైదరాబాద్: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కి గురై గత కొన్ని రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజ సోమవారం మృతి ) చెందింది. అక్టోబర్ 30న వాంకిడి ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరగగా 64 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురు పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించారు. రిలో ఇద్దరు కోలుగా శైలజ పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ పై ఉంచి చికిత్స అందించారు. దాదాపు 20 రోజులుగా చికిత్స పొందిన ఆమె చివరకు మృత్యువాత పడ్డారు. శైలజ మృతితో తల్లిదండ్రులు, బంధువు ల రోదనలు మిన్నంటాయి. కాగా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గురుకుల పాఠశాలలు అధ్వాన్నంగా మారి విద్యార్థులు చనిపోతున్నారని అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ నిర్లక్ష్యానికి బలైపోయిన వాంకిడి గిరిజన గురుకుల విద్యార్థిని శైలజకు కన్నీటి నివాళి అర్పిస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు. మీ ప్రాణాలు బలి తీసుకున్న పాపం.. ఈ దుర్మార్గపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతదన్నారు. 25 రోజులుగా నువ్వు వెంటిలేటర్ మీద అనుభవించిన నరకానికి ప్రభుత్వమే జవాబుదారీ అని హరీశ్‌రావు పేర్కొన్నారు.శైలజ తల్లిదండ్రులకు గుండె కోతను మిగిల్చిండు సీఎం రేవంత్ రెడ్డి. తోటి విద్యార్థులతో ఆడుతూ, పాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారి.. విషాహారం వల్ల కన్నుమూయటం కలిచి వేస్తున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యం అభం, శుభం తెలియని గిరిజన బిడ్డకు శాపంగా మారింది.

## లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, మహారాష్ట్రలో భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమి భారీ విజయం సాధించిన నేపథ్యంలో సూచీలు వరుసగా రెండో రోజూ రాణించాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి.

దీంతో సెన్సెక్స్ మళ్లీ 80వేల ఎగువకు చేరింది. నిఫ్టీ 24,200 పాయింట్ల ఎగువన స్థిరపడింది.

సెన్సెక్స్ ఉదయం 80,193.47 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,117.11) లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 1300 పాయింట్లకు పైగా లాభపడి 80,473.08 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 992.74 పాయింట్ల లాభంతో 80,109.85 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 314.65 పాయింట్ల లాభంతో 24,221.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ కాస్త బలపడి 84.30కి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎల్‌అండ్‌టీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,

అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టపోయాయి.

అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2672 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బీఎస్ఈ సెన్సెక్స్ సూచీలోకి జొమాటోను తీసుకొంటున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఇవాళ ఆ కంపెనీ షేరు రాణించింది.

# మహిళలను గౌరవిస్తే దేవతలను పూజించినట్టే.












**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 25:**

ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతలను పూజించినట్టేనని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి పద్మావతి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ బస్వారెడ్డి పేర్కొన్నారు. కుటుంబంలోని మహిళల మధ్య సఖ్యత సమన్వయం ఉన్నప్పుడు ఎలాంటి సమస్యలు తలెత్తవని వారు తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో గల జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ హింస వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రికన్స్ట్రక్షన్ నిర్వహించ బడుతున్న సఖి వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి పద్మావతి, ట్రైనీ కలెక్టర్ సాకేత్ కుమార్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ బస్వా రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సృష్టిలో మహిళకు ఓ గొప్ప స్థానం ఉందని మహిళను గౌరవించుకోవడం జరుగుతుందన్నారు.. ఎక్కడైతే స్త్రీ గౌరవింపబడుతుందో అక్కడ దేవతను పూజించినట్టు వారు చెప్పారు. కానీ ప్రస్తుత తరుణంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ ఇంకా మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడైతే కుటుంబంలో అమ్మాయి అబ్బాయి అని తేడా చూపిస్తూ పెంచడం వలన కూడా ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని వారు చెప్పారు. ఎప్పుడైతే తల్లిదండ్రులు ఆడవారి పట్ల గౌరవంగా ఉండడం గౌరవంగా నడుచుకోవడం మంచి నడవడిక పద్ధతులు నేర్పినట్లయితే అదే నడవడికతో పిల్లలు సమాజంలో ఉంటారని తెలిపారు.. అదేవిధంగా కుటుంబంలో కుటుంబ పెద్దలను పిల్లలు గౌరవిస్తే అది చూసి ముందు తరాల పిల్లలు కూడా గౌరవించడం నేర్చుకుంటారని తెలిపారు. ముఖ్యంగా ఎప్పుడైతే మహిళలు గౌరవింపబడతారో అప్పుడు సమాజంలోని మహిళలను కూడా గౌరవంగా చూడడం జరుగుతుందని వారు చెప్పారు. మహిళల సంరక్షణార్థం ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన ఇంట్లో పెద్దలు మంచి చెడు చెప్పకపోతే ఇలాంటి నైతిక విలువలు కోల్పోయి మహిళలపై దాడులకు పాల్పడుతా రని తెలిపారు..సుమారు కొన్ని వేల కేసులు గృహహింస కేసులు, వరకట్న వేధింపుల కేసులు నమోదు కావడం బాధాకరంగా ఉందని

న్యాయమూర్తి పద్మావతి ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని కేసులు నమోదు కావడానికి కారణం కూడా ఇంట్లో పెద్దలు చిన్నపాటి సమస్యలు సైతం చూసి చూడనట్లు వ్యవహరించడం కలుపుకొని పోవడంతో కేసుల వరకు వెళ్ళవని వారు చెప్పారు. అనవసరంగా కేసుల బారిన వెళ్లి ప్రశాంతమైన జీవితాన్ని పాడు చేసుకోవద్దని సూచించారు.. ఒక కుటుంబం నిలవాలంటే ఇంటి పెద్దల బాధ్యత ముఖ్యంగా ఉంటుందని మరోసారి గుర్తు చేశారు.. ఈ సందర్భంగా చిన్నారులు మహిళలు ప్రదర్శించిన నాటక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. పలువురు మహిళలను అలాగే నాటక ప్రదర్శన చేసిన చిన్నారులను మరియు వివిధ రంగాల్లో సేవలు అందించే మహిళ లను ఘనంగా సన్మానించారు. వీరిలో వైద్య రంగం డాక్టర్ రోహిణి, న్యాయవాది వసంత కుమారి, టీచింగ్ ఎన్. విమల, సమాజ సేవా రంగం లో లక్ష్మి దేవి, స్పోర్ట్స్ రంగంలో శ్రీవాణి, పరిశ్రమిక రంగంలో లత లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్ సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, సఖి అడ్మినిస్ట్రేషన్ భానుప్రియ, కౌన్సిలర్లు, సఖి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ బస్వారెడ్డి.**

**స్నేహ సొసైటి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ హింస వ్యతిరేక దినోత్సవం.**

## ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు ముమ్మర ఏర్పాట్లు

**కొత్తగా మరో నాలుగు ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి..**

**తొలుత అందుబాటులోకి రానున్న మామునూరు ఎయిర్‌పోర్టు**



హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా మరో నాలుగు ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి రానున్నాయి. వరంగల్‌లోని మామునూరు, భద్రాద్రి కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు సీఎం రేవంత్ సర్కారు రెడీ అయ్యింది. ఇక కేంద్రంలో పౌర విమానయాన శాఖ మంత్రిగా తెలుగు వ్యక్తి రామ్మోహన్‌నాయుడు ఉండడంతో అనుమతుల విషయంలోనూ సానుకూల స్పందన వచ్చే ఛాన్స్ ఉంది. అయితే హైదరాబాద్ తర్వాత తెలంగాణలోనే అతిపెద్ద నగరమైన వరంగల్‌లో ఉన్న మామునూరులో తొలుత ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానుంది. తొలి విడతలో మామునూరు ఎయిర్‌పోర్టును చిన్న విమానాల రాకపోకలకు అనుగుణంగా సిద్ధం చేస్తారు. వరంగల్ మహానగరం మాస్టర్ ప్లాన్ తయారీకి ఇప్పటికే ఆమోదం లభించింది. మాస్టర్ ప్లాన్ అమలుతో పాటు మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి ప్రక్రియను 2025 డిసెంబరుకల్లా పూర్తి చేయాలని తెలంగాణ సర్కారు టార్గెట్‌గా పెట్టుకుంది. ఆ తర్వాత 2027 సంవత్సరం నాటికి రెండో దశలో పెద్ద విమానాలు, కార్గో విమానాల ఆపరేషన్‌కు వీలుగా మాము నూరు ఎయిర్ పోర్టును డెవలప్ చేస్తారు. వాస్తవానికి నిజాం నవాబు పాలనా కాలంలో మామునూరులో ఎయిర్ పోర్టు ఉండేది. దీనికి ఇప్పటికే 696.14 ఎకరాల భూమి ఉంది. ఎయిర్ పోర్టు కోసం అదనంగా మరో 253 ఎకరాలను సేకరించేందుకు తెలంగాణ సర్కారు

రూ.205 కోట్లను ఇటీవలే విడుదల చేసింది. రాబోయే నాలుగేళ్లలో భద్రాద్రి కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులు కూడా అందుబాటులోకి వచ్చే ఛాన్స్ ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిర్ పోర్టు ఏర్పాటు కోసం మూడు మండలాల పరిధిలో దాదాపు వెయ్యి ఎకరాల్లో భూసేకరణపై ఓ అంచనా కు వచ్చారు.

రామగుండం పట్టణం సమీపంలో ఉన్న బసంత్‌నగర్‌లో గతంలోనే ఎయి ర్‌పోర్టు ఉండేది. బీకే బిర్లా తమ సిమెంట్ పరిశ్రమ సమావేశాలకు రావడానికి దీన్ని అప్పట్లో ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ఇదే ప్రాంతంలో కొత్తది ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్కారు యోచిస్తోంది. ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు దాదాపు 1,592 ఎకరాల్లో భూమి రెడీగా ఉందని తెలుస్తోంది. అయితే ఈ మూడు ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటుకు ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నుంచి అనుమతులను పొందాల్సి ఉంది.

## స్నాతకోత్సవంలో పీహెచ్డీ వారందరినీ గౌరవించాలి.

**- టియు విసి కి విన్నపం.**

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, నవంబర్ 25:**



తెలంగాణ యునివర్సిటీ రెండవ స్నాతకోత్సవంలో పీహెచ్డీ పూర్తి చేసిన వారందరినీ గౌరవించాలని పలువురు విసికి సోమవారం కలిసి విన్నవించారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి రెండవ స్నాతకోత్సవంలో భాగంగా నోటిఫికేషన్ రిలీజ్ చేయగా, అందులో 2013 నుంచి 23 అకాడమిక్ ఇయర్ వాళ్లకు పీహెచ్డీ పూర్తి చేసి ఇంకా కాన్వకేషన్ తీసుకొని వాళ్లకు మాత్రమే అవకాశం ఇస్తా అనడం సరైంది కాదని అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఎస్టాబ్లిష్ అయి నుంచి మొదటి కాన్వకేషన్ వరకు ఎవరు కూడా పీహెచ్డీ పూర్తి చేయలేదు, కాబట్టి కన్వొకేషన్ ఇవ్వలేదు. కానీ ఈ రెండవ స్నాతకోత్సవం వరకు దాదాపు 80 నుంచి 100 మంది పిహెచ్డి పూర్తి చేయడము మంచి శుభ పరిణామము. యూనివర్సిటీకి ఒక పేరు ప్రతిష్టలు తీసుకొచ్చే విషయం. కాబట్టి దాదాపు పీహెచ్డీ పూర్తి చేసిన వాళ్లందరికీ మరోసారి వేదిక పైన గౌరవప్రదంగా ఇవ్వవలసిందిగా వారు విన్నవించారు. దీనికి వైస్ ఛాన్సలర్ సానుకూలంగా స్పందించి అందరికీ గౌరవప్రదంగా ఇవ్వడానికి అన్ని అవకాశాలు వెతుకుతున్నామని అన్నారు. 2024లో పిహెచ్డి పూర్తి చేసిన వాళ్లకు కూడా ఇప్పించే ప్రయత్నం చేస్తామని అన్నారు. అదేవిధంగా రిజిస్ట్రార్, ఎగ్జామినేషన్ కంట్రోలర్ ను కూడా కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ సరిత, డాక్టర్ పి బి సత్యం, డాక్టర్ జి. రమేష్, డాక్టర్ జి. సతీష్ పాల్గొన్నారు.

## బాలరక్ష భవన్ ను సందర్శించిన సోషల్ వర్క్ విద్యార్థులు.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, నవంబర్ 25:**




తెలంగాణ యూనివర్సిటీ దక్షిణ ప్రాంగణం డిపార్ట్మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ మొదటి సంవత్సరం విద్యార్థులు వారి యొక్క క్షేత్ర పరిశీలన సందర్శనలో భాగంగా డా. అంజయ్య బందెల , అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో బాల రక్ష భవన్ ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ మాలోత్ మోహన్ మాట్లాడుతూ, పిల్లల రక్షణ, భద్రత, చట్టాల గురించి క్లుప్తంగా వివరించారు. బాల కార్మికులు లేనటువంటి సమాజం కావాలి అని ఆకాంక్షించారు. బాలలపై లైంగిక వేదింపులు వంటి చర్యలకు పాల్పడితే కఠినమైన చట్టాల ద్వారా శిక్షార్హులవుతారు అని తెలిపారు. బాల్య వివాహాలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రొటెక్షన్ ఆఫీసర్ (నాన్ ఇంస్టిట్యూషనల్ కేర్) స్వామి, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ బీ.స్వరూప, బాల రక్ష భవన్ సిబ్బంది, సోషల్ వర్క్ మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన 5,431 మందికి లీగల్ నోటీసులు

**వాహన యజమానుల పెండింగ్ చలాన్ల డేటా సేకరణ**

**వరంగల్:** వరంగల్ నగరంలో నిత్యం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి వారికి లీగల్ నోటీసులు అందజేసే పనిలో పడ్డారు ట్రాఫిక్ పోలీసులు. పోలీసులు తమ వాహనంపై పదికి పైగా చలాన్లు పెండింగ్‌లో ఉన్న వాహన యజమానుల డేటాను సేకరించారు , వారిలో ఇప్పటివరకు 5,431 మందికి లీగల్ నోటీసులు పంపారు. నగర పోలీసులు తరచూ తనిఖీలు నిర్వహించి అక్రమార్కులకు జరిమానాలు విధించడం ద్వారా ఈ పద్ధతిని అరికట్టేందుకు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రస్తుత సంవత్సరంలో ట్రాఫిక్ పోలీసులు 1115 మందిపై చార్జిషీట్లు దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచి జరిమానాలు వసూలు చేశారు. నగరంలో అక్రమాలకు పాల్పడిన 71,782 వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయని పోలీసులు గుర్తించి, వాటిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొలుత మూడు చలాన్లు దాటిన వాహనదారులపై చార్జిషీట్లు దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. చలాన్లు చెల్లించకుండా తప్పించుకున్న వాహనదారులను స్పెషల్ డ్రైవ్‌లో పట్టుకుని వారి వాహనాలను సీజ్ చేశారు. గతంలో రెండుసార్లు చలాన్లపై భారీ రాయితీ ఇచ్చినా చాలా మంది వినియోగించలేదు. ప్రస్తుతం 150 పెండింగ్‌లో ఉన్న చలాన్ వాహనాలు నగర రోడ్లపై తిరుగుతున్నాయని ట్రాఫిక్ అధికారులు తెలిపారు. జరిమానా విధించిన మూడు రోజుల్లోనే ఇ-చలాన్‌లు స్వయంచాలకంగా కోర్టుకు రిఫర్ చేయబడతాయని, ఉల్లంఘించిన వారిపై ప్రత్యక్ష చర్యలు తీసుకునే అధికార పరిధి పోలీసులకు లేకుండా పోతుందని పోలీసు అధికారులు వెల్లడించారు .

వేగుచుక్క

# వర్మ ఫోన్ స్విచ్ఛాఫ్



ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేసులో ప్రముఖ టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మ విచారణ ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. వర్మపై ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైంది. ముందుగా ఈ కేసులో నవంబర్ 19 (మంగళవారం)న విచారణకు హాజరుకావాలని నోటీసులు పంపినప్పటికీ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో మరోసారి నోటీసులు పంపించిన మేరకు నేడు విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. రాలేనంటూ లాయర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాడు వర్మ. దీంతో రంగంలోకి దిగిన ఒంగోలు పోలీసులు హైదరాబాద్‌లోని ఆర్జీవీ ఇంటికి వెళ్లారు. అయితే వర్మ అక్కడ లేకపోవడంతో పోలీసులు గాలింపు చేపడుతున్నారు. వర్మ ఫోన్ స్విచాఫ్ అని వస్తుందని తెలుస్తోంది. వర్మ తాను కోయంబత్తూరులో ఉన్నట్టు ట్వీట్ చేయగా.. మరోవైపు సోషల్ మీడియాలో అకౌంట్ హ్యాండిల్స్ మాత్రం హైదరాబాద్‌లోనే చూపిస్తున్నాయట. వర్మకు ఓ ప్రముఖ నటుడు తన ఫాంహౌజ్‌లో ఆశ్రయం ఇచ్చినట్టుగా వార్తలు తెరపైకి వస్తున్నాయి. ఈ మేరకు శంషాబాద్, షాద్ నగర్ దగ్గర రెండు ఫాంహౌజ్‌లపై ఏపీ పోలీసులు ఫోకస్ పెట్టినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వర్మ ఇంతకీ ఎక్కడున్నారో మరి అంటూ నెట్టింట తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు.



# మాజీ ప్రేయసితో వెంకటేష్ డ్యూయెట్

వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా జనవరి 14న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. ప్రస్తుతం వెంకటేశ్, ఆయనకు ఎక్స్ గర్ల్ ఫ్రెండ్‌గా నటిస్తున్న మీనాక్షి చౌదరిలపై ఓ అందమైన పాటను దర్శకుడు అనిల్ రావిపూడి చిత్రీకరించే పనిలో ఉన్నారు. డెహ్రాడూన్, ముస్సోరీ, రిషికేశ్‌లోని అద్భుతమైన లొకేషన్స్‌లో ఈ పాట చిత్రకరణ జరుగుతున్నది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా,

అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటకు భాను మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ షెడ్యూల్‌లో ఈ ఒక్క పాటను మాత్రమే చిత్రీకరిస్తామని, త్వరలోనే మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెడతామని చిత్ర సమర్పకులు దిల్‌రాజు తెలిపారు. ఐశ్వర్య రాజేష్ మరో కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేష్, వీటీ గణేశ్, మురళీధర్‌గౌడ్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, నిర్మాత: శిరీష్, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్.



# నేనంటే తనకు అస్సలు పడదు

అందం, అభినయ సామర్థ్యం రెండూ దండిగా ఉన్న కథానాయిక అషికా రంగనాథ్. కలిసొచ్చే అదృష్టం కోసం కళ్లలో దీపాలు పెట్టుకొని మరీ ఎదురు చూస్తున్నది ఈ కన్నడ కస్తూరి. సిద్ధార్థ్‌కి జోడీగా ఈ అందాలభామ నటించిన 'మిస్ యు' సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఎన్.రాజశేఖర్ దర్శకత్వంలో సామ్యూల్ నిర్మించిన ఈ చిత్రంపై అషికా ఎంతో ఆశ పెట్టుకున్నది. ఇటీవల ఈ సినిమా గురించి తను మాట్లాడుతూ 'ఇందులో నా పేరు సుబ్బులక్ష్మి. సిద్ధార్థ్ పేరు వాసుదేవ్. నేనంటే తనకు అస్సలు పడదు. కానీ.. అనుకోకుండా నా ప్రేమలో పడిపోతాడు. కారణం ఏంటో తెరపైనే చూడాలి.' అంటూ చెప్పుకొచ్చింది అషికా రంగనాథ్. ఇంకా మాట్లాడుతూ 'నేను ఎలాంటి పాత్రలనైతే ఇష్టపడతానో.. అలాంటి పాత్ర సుబ్బులక్ష్మి. తను ఇన్నోసెంట్. పక్కా ట్రెడిషనల్. ఓ విధంగా ఇది సుబ్బులక్ష్మి కథే. ఇంతటి మంచి పాత్ర ఇచ్చిన దర్శకుడు రాజశేఖర్‌కీ, హీరో సిద్ధార్థ్‌కీ థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అని తెలిపింది అషికా.

# హిందీలో ఎన్‌టీఆర్‌కు రెండో సినిమా



జూనియర్ ఎన్టీఆర్ యాక్షన్ డ్రామా ప్రాజెక్ట్ వార్ 2తో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. అయాన్ ముఖర్జీ డైరెక్షన్‌లో హృతిక్ రోషన్ మరో లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా ఈ సినిమా విడుదల కాకముందే తారక్ మరో హిందీ సినిమాకు సంతకం చేశాడన్న వార్త నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం యశ్ రాజ్ ఫిలిమ్స్‌తో తారక్ మరో భారీ సినిమా కోసం చర్చలు జరుపుతున్నాడని బీటౌన్ సర్కిల్‌లో ఓ వార్త హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు చెప్పిన కథ తారక్‌కు నచ్చిందట. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే 2025 చివరలో ఈ సినిమా లాంచ్ కాబోతుందట. ప్రస్తుతానికి ఆ డైరెక్టర్ ఎవరనేది సస్పెన్స్ నెలకొంది. యశ్ రాజ్ ఫిలిమ్స్ తరచూ స్టార్ యాక్టర్లలో మూడు సినిమాల ఒప్పందం కుదుర్చుకుంటుందని తెలిసిందే. మరి ఎన్టీఆర్ కూడా ఇలాంటి అగ్రిమెంట్‌కు సంతకం ఏమైనా చేశాడా..? అన్నది తెలియాల్సి ఉంది. మొత్తానికి ఏదేమైనా తారక్ త్వరలో హిందీలో రెండో సినిమాకు సైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడన్నది మాత్రం నిజమేనని తాజా వార్తలు క్లారిటీ ఇచ్చేస్తున్నాయి. ఆర్‌ఆర్‌ఆర్‌తో గ్లోబల్ స్టార్ డమ్ సంపాదించుకున్న తారక్ ఇక హిందీలో కూడా తన సత్తా చూపించాలని డిసైడ్ అయినట్టు తాజా న్యూస్ హింట్ ఇచ్చేస్తుంది.



# తననెవరో అందరికీ తెలుసు..

రిలేషన్‌షిప్‌పై రష్మిక మందన్న టాలీవుడ్‌లో మోస్ట్ క్రేజీయెస్ట్ కాంబోలో టాప్‌లో ఉంటుంది విజయ్ దేవరకొండ -రష్మిక మందన్నా. గీతగోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాలతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన ఈ ఇద్దరు ఆఫ్ స్క్రీన్‌లో కూడా సూపర్ బాండింగ్ మెయింటైన్ చేస్తుంటారని తెలిసిందే. ఎప్పటికప్పుడు కలిసి కనిపిస్తూ నెట్టింట హాట్ టాపిక్‌గా నిలుస్తుంటారు. ఈ ఇద్దరు రిలేషన్‌షిప్‌లో ఉన్నారని చాలా కాలంగా నెట్టింట చర్చ నడుస్తుంది. అయితే దీనిపై మాత్రం అటు రష్మికకానీ, ఇటు విజయ్ దేవరకొండ కానీ సస్పెన్స్ మెయింటైన్ చేస్తూ వస్తున్నారు. అభిమానుల్లో నెలకొన్న డైలామాకు రష్మిక మందన్నా చెక్ పెట్టేసింది. చెన్నైలో జరిగిన పుష్ప 2 వేడుకలో తన రిలేషన్ షిప్ స్టేటస్‌పై ఓపెన్ అయిపోయింది కన్నడ ఆడిటోరియం అంతా అరుపులు,కేకలతో దద్దరిల్లిపోయింది. విజయ్ దేవరకొండతో ఉన్న రిలేషన్‌షిప్‌పై చాలా కాలంగా

నెలకొన్న సస్పెన్స్‌కు తాజా కామెంట్స్‌తో ఫుల్ స్టాప్ పెట్టేసింది

రష్మికమందన్నా. మరోవైపు ఇటీవలే తాను డేటింగ్‌లో ఉన్నానని, ఇప్పుడు తన వయస్సు 35 ఏండ్లు. ఇంకా సింగిల్‌గా ఉండమంటారా..? అందరం ఏదో ఒకటైంలో పెళ్లి చేసుకోవాల్సిందే..అంటూ సోయగం. మీకు ఇష్టమైన వ్యక్తి ఎవరు..? అతడు ఇండస్ట్రీ చెందిన వాడేనా..? అని యాంకర్ అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. అతడెవరో అందరికీ తెలుసునని చెప్పింది. రష్మిక సమాధానంతో రిలేషన్‌షిప్ గురించి హింట్ ఇచ్చేశాడు విజయ్ దేవరకొండ. ఈ లెక్కన త్వరలోనే విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా పెండ్లిపై క్లారిటీ వచ్చే అవకాశాలు లేకపోలేదంటున్నారు సినీ జనాలు.

## లేట్ విషయంలో నేనేం చేయలేను : దేవీశ్రీ ప్రసాద్



సినీ ఇండస్ట్రీలో కొన్ని కాంబినేషన్స్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. కొన్ని కాంబోల్లో సినిమా వస్తుందంటే చాలు బాక్సాఫీస్ రికార్డుల గురించే అంతటా చర్చ నడుస్తుంటుంది. అలాంటి జాబితాలో టాప్‌లో ఉంటుంది మైత్రీ మూవీ మేకర్స్-సుకుమార్-దేవీ శ్రీ ప్రసాద్ కాంబినేషన్. ఈ ముగ్గురి కాంపౌండ్ నుంచి వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించాయని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయితే పుష్ప 2 ది రూల్ సినిమా విషయంలో మాత్రం వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయని టాక్ నెట్టింట వినిపిస్తూనే ఉంది. దీనిక్కారణం ఈ సారి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విషయంలో డీఎస్పీతోపాటు మరికొందరు సంగీత దర్శకులకు ఇవ్వడమనేది అంతటా నడుస్తున్న చర్చ. ఈ విషయం నిజమేనని పుష్ప 2 ది రూల్ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో మరోసారి తేలిపోయింది. ఈవెంట్‌కు దేవి శ్రీ ప్రసాద్ కాస్త ఆలస్యంగా వచ్చాడు. ఈ విషయాన్ని నిర్మాతల్లో ఒకరైన నవీన్ యేర్నేని డీఎస్పీని అడిగారు.

## భక్తకన్నప్ప రిలీజ్ అప్పుడే...?



టాలీవుడ్ యాక్టర్ మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం కన్నప్ప. బాలీవుడ్ డైరెక్టర్ ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రభాస్, మోహన్ లాల్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్, ఐశ్వర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఆయా పాత్రలకు సంబంధించిన లుక్స్ విడుదల చేయగా.. నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా సినిమా విడుదల తేదీని ప్రకటించారు

వేగుచుక్క

# నలంద"లో ఘనంగా బాలలదినోత్సవం.
















## విద్యార్థులే ఉపాధ్యాయులుగా స్వయం పరిపాలన.
## ఆటపాటలతో అలరించిన విద్యార్థులు.
## పాల్గొన్న యాజమాన్యం ప్రసాద్, సాగర్.

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, నవంబర్ 25:** పట్టణంలోని మామిడిపల్లి లో గల నలంద హైస్కూల్ లో సోమవారం బాలల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి స్వయం పరిపాలన దినోత్సవంను జరుపుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాగర్ జ్యోతి ప్రజ్వలన చేయగా, కరెస్పాండెంట్ ప్రసాద్ పూజ నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర, గొప్పతనం గురించి వివరంగా తెలియజేశారు. పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయులుగా చేసి, వారి అనుభవాలు తెలియజేశారు. భవిష్యత్ లో తాము కూడా ఉపాధ్యాయులు గా కావాలి అనుకొంటున్నాం అని పేర్కొన్నారు.

మధ్యాహ్నం నిర్వహించిన చిల్డ్రన్ డే స్పెషల్ ప్రోగ్రాం లో విద్యార్థులు డ్యాన్సు, ఉపన్యాసాలు, ఫ్యాన్సీ డ్రెస్ షో లో పాల్గొని అక్కడ ఉన్న ఉపాధ్యాయులను, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. ఒలంపియాడ్ స్కూల్, ప్రీస్కూల్ విద్యార్థులకు ఈ నెలలో నిర్వహించిన ఎస్ఏ 1 పరీక్షలో మొదటి మూడు ర్యాంక్స్ సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో యాజమాన్యం ప్రసాద్, సాగర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.











# మహా పీఠంపై ఎవరు? తెరపైకి కొత్త ముఖాలు !

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. 'మహాయుతి' బంపర్ మెజార్టీ సాధించింది. అయితే, ఇప్పుడు వినిపిస్తున్న ప్రధాన ప్రశ్న.. ముఖ్యమంత్రి పదవి ఎవరికి ఇస్తారు? కూటమిలోని బీజేపీ, ఎన్సీపీ, శివసేనల్లో ఏ పార్టీకి ఆ పదవి దక్కుతుంది? ఏ నేత ఆ కుర్చీలో కూర్చుంటారనేది ఆసక్తి కలిగిస్తున్న ప్రశ్న. శివసేన నేత ఏక్‌నాథ్ శిందే ఆ పదవిని వదులుకుని అత్యధికంగా 132 సీట్లు గెలిచిన బీజేపీకి చెందిన మాజీ సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు మద్దతు ఇస్తారా?ఒకవేళ ఎక్కువ సీట్లు గెలిచిన బీజేపీకే సీఎం పదవి ఇస్తే ఫడణవీస్‌కే అవకాశం దొరుకుతుందా? లేదంటే కొత్తవారికి చాన్స్ వస్తుందా? కూటమిలోని మరో పార్టీ నేషనలిస్ట్ కాంగ్రెస్ నేత అజిత్ పవార్ కూడా రేసులోకి వస్తారా? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానం దొరికితే కొత్త సీఎం ఎవరనే ప్రశ్నకు జవాబు చెప్పడం సులభమవుతుంది. హారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ శిందే ఉన్నప్పటికీ ఎన్నికలకు ముందు కూటమి ఆయన్ను



ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించలేదు. మహా వికాస్
అఘాడి పరిస్థితీ అదే. ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటిస్తే తమ మధ్య గొడవలు రావచ్చని పార్టీల నేతలు ఆందోళన చెంది ఉండవచ్చు. అందుకే ఈ వ్యవహారాన్ని ఎన్నికల తర్వాత తేల్చుకోవాలని భావించి ముందుగా ప్రకటన చేయలేదు. కానీ, ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చేసింది. ఎన్నికలకు ముందు మహా వికాస్ అఘాడిలో ముఖ్యమంత్రి పదవి మీద చాలా గందరగోళం ఉంది. ఉద్ధవ్ ఠాక్రే స్వయంగా ముఖ్యమంత్రి పదవికి ముందుకు రావడానికి ఆసక్తి చూపించారు. అయితే కూటమిలోని మరో రెండు పార్టీలు కాంగ్రెస్, ఎన్సీపీ ఈ ప్రతిపాదనను అంగీకరించలేదు. ఇక 'మహాయుతి'లో ఎన్నికలకు ముందు అలాంటి గందగోళం లేదు. ఈ కూటమి కూడా సీఎం అభ్యర్థిని ముందుగా ప్రకటించనప్పటికీ నేతలెవరూ దానిపై ఆసక్తి కనబరుస్తూ ప్రకటనలేమీ చేయలేదు. అయితే.. ఇప్పుడు ముఖ్యమంత్రి పదవికి అనేక 'ఆప్షన్స్' ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరించింది కాబట్టి ఆ పార్టీ నేత సీఎం కావడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే,
త్వరలో ముంబయి కార్పొరేషన్
సహా, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండడంతో అవన్నీ దృష్టిలో పెట్టుకుని బీజేపీలోనే కొత్త ముఖాలను తీసుకువచ్చే అవకాశం కూడా లేకపోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత అదే నేతను సీఎంగా కొనసాగించడం లేదాఎన్నికల ఫలితాల తర్వాత మరొకరికి అవకాశం ఇవ్వడం కూడా జరగొచ్చని అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలు, మరాఠా రిజర్వేషన్లపై కోర్టు నిర్ణయం వెలువడే వరకు ఏక్‌నాథ్ శిందేను ముఖ్యమంత్రిగా కొనసాగించడం మరో ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది.